క్లుప్తంగా

నూతన ఆలయ నిర్మాణానికి అంకురార్పణ



కటారి సుబ్బారావును సత్కరిస్తున్న పెద్దలు

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం ప్రజలు చిర కాలంగా ఎదురు చూస్తున్న గ్రామ దేవత శ్రీ చింతాలమ్మ అమ్మవారి నూతన ఆలయ నిర్మాణానికి అంకురార్పణ జరిగింది. గ్రామ పెద్దలు 7గురిని గౌరవాధ్యక్షులుగా, మరో 10 మందిని నూతన కమిటీ సభ్యులుగా సోమవారం సంఘ కార్యదర్శి పొన్న రామచంద్రరావు ఆధ్వర్యాన ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు గౌరవాధ్యక్షులు, సభ్యులుగా సేవలందించిన కటారి సుబ్బారావు తదితరులను వాసవి గ్రాఫిక్స్ సుధాకర్ సత్కరించారు.

రెండు తలల పాము



పోలవరంలో కనిపించిన రెండు తలల పాము

పోలవరం రూరల్: పోలవరం పంచాయతీ పరిధిలోని బీసీ కాలనీలో ఆదివారం రాత్రి రెండు తలల పాము కనిపించింది. స్థానికులు పోలవరం అటవీశాఖాధికారికి సమాచారం ఇవ్వడంతో అటవీ శాఖ సిబ్బంది దానిని స్వాధీనం చేసుకుని అటవీ ప్రాంతంలో వదిలేశారు.

సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం సోమవారం జరిగింది. ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంభం విజయరాజు సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అధ్యక్షుడిగా రవీంద్రబాబు, సభ్యులు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. రవీంద్రబాబు మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, వైఎస్సార్ సీపీ పామర్రు నియోజకవర్గ పరిశీలకుడు మండవల్లి సోంబాబు, సీనియర్ నాయకులు మేడవరపు విద్యాసాగర్, గూడపాటి రాధాకృష్ణ, సంఘ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ కూరగాయల స్టాల్ ప్రారంభం



కార్పొరేషన్ కార్యాలయం వద్ద స్టాల్ ప్రారంభించిన కమిషనర్ వెంకటకృష్ణ

ఏలూరు రూరల్ : సేంద్రియ కూరగాయలు, పండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని నగర కమిషనర్ ఎస్ వెంకటకృష్ణ అన్నారు. సోమవారం ఏలూరు కార్పొరేషన్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయంలో పండించిన కూరగాయల స్టాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం రైతులకు పెట్టుబడి తగ్గించడంతో పాటు ప్రజలకు ఆరోగ్యకరమైన ఉత్పత్తులు అందిస్తుందన్నారు. ఈ విధానంపై రైతులు మరింత అవగాహన పెంచుకోవాలన్నారు. జీవామృతం, కషాయాలు, పంచాంగవ్య, కోడిగుడ్డుతో ద్రావణ తయారీ విధానాన్ని సాగుదారులు వివరించారు. జిల్లా ఏపీసీఎన్ఎఫ్ ప్రాజెక్టు మేనేజర్ డీపీఎం తాతారావు పర్యవేక్షణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎంటీ సుబ్బరాజు, నాగరాజు, సతీష్, చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

హుండీల ఆదాయం లెక్కింపు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కొత్తపేట నూకాలమ్మవారి ఆలయ హుండీల ఆదాయం 143 రోజులకు రూ.1,27,918 లభించింది. సోమవారం ఆలయ కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసిరావు ఆధ్వర్యంలో స్థానిక పెద్దలు వెల్లంకి రాజు, జనపరెడ్డి కన రాజేశ్వరి కృష్ణ, నక్క నాగేశ్వరరావు హుండీల ఆదాయాన్ని లెక్కించగా, హనుమాన్ జంక్షన్‌లోని అభయాంజనేయ స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి కూచిపూడి శ్రీనివాస్ పర్యవేక్షించారు.

నాయకులను కలిసిన జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

ఏలూరు (మెట్రో): రాజ్యసభ సభ్యులుగా నామినేషన్ దాఖలు చేసిన వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావులను జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు దంపతులు, ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

టీచర్స్ టూల్ ట్రైనింగ్‌ను సెలవుల్లో నిర్వహించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): 10వ తరగతి పరీక్షల నేపథ్యంలో ఈ నెల 13 నుంచి ప్రారంభించే టీచర్స్ టూల్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని వాయిదా వేసి, వేసవి సెలవుల్లో నిర్వహించాలని డెమొక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.శ్రీను, పి.వెంకటేశ్వరరావు రాష్ట్ర ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ బి.ప్రతాపరెడ్డికి విజ్ఞప్తి చేశారు. లేకుంటే శిక్షణ కేంద్రాలను డివిజన్ పరిధిలోకి మార్చాలని వారు కోరారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- బొర్రంపాలెంలో 'ఆసరా' చెక్కుల పంపిణీ
- హాజరైన ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్



సభలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ పోలవరం ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మి



హాజరైన మహిళలు

టి.నరసాపురం: మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుండాలనే లక్ష్యంతోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని బొర్రంపాలెంలో సోమవారం ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావడం కోసం ఆసరా పథకం ద్వారా అందిస్తున్న లబ్ధి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మహిళలకు ఆర్థిక స్వావలంబన చేకూరుతుందని, సంక్షేమ పథకాల నుంచి రాజ్యాంగ పదవుల వరకు మహిళలకే ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. మహిళలు లక్షాధికారులు కావాలనే లక్ష్యంతో మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి చేస్తుందని వివరించారు. వచ్చే ఎన్నికల యుద్ధంలో ధర్మం వైపు పోరాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని, లండన్‌లో విద్యనభ్యసించి రాజకీయాల్లోకి వచ్చిన యువకుడు, మంత్రి కుమారుడు కారుమూరి సునీల్ కుమార్ యాదవ్‌ను ఎంపీగా, పోలవరం ఎమ్మెల్యేగా తన సతీమణి తెల్లం రాజ్యలక్ష్మిని గెలిపించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. సభలో వైఎస్సార్ సీపీ ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ మహిళలు ఎవరి వద్ద చేయి చాచకూడదని, అప్పులు చేయకూడదని, అప్పులు ఇచ్చే స్థాయికి ఎదగాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. పిల్లల భవిష్యత్తు బాగుండాలనే ఉద్దేశ్యంతోనే పాఠశాలలు, విద్యాభివృద్ధికి రూ.60 వేలు కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. పేదల నుంచి ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్లు రావాలనే ఉద్దేశ్యంతో విద్యకు అంత ప్రాధాన్యత ఇచ్చారని వివరించారు. కేంద్రం నుంచి రావాల్సిన ప్రతి పైసా వచ్చేలా కృషి చేస్తానని, గిరిజనుల అభివృద్ధికి పనిచేస్తానని, పార్లమెంట్‌లో తన వాణిని వినిపిస్తానని వివరించారు. పోలవరం నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల్లో మార్పు వస్తేనే రాబోయే తరాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఒక కుటుంబంలో ఉద్యోగం వస్తే ఆ కుటుంబంతో పాటు సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యకు ప్రాధాన్యత ఇచ్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కుయుక్తులు, కుతంత్రాలతో మోసం చేయడానికి కొన్ని పార్టీలు సిద్ధం అవుతున్నాయని, వారి మాటలు నమ్మవద్దన్నారు. జగనన్న అంటేనే ధైర్యం అని నమ్మకం, భరోసా, పారదర్శకత, ప్రోత్సాహం అని వివరించారు. సభలో టి.నరసాపురం మండలం మహిళలకు రూ.10,79,13,408ల చెక్కును పంపిణీ చేశారు. మహిళలు సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీల విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణరాజు, ఎంపీపీ దారబోయిన లక్ష్మీవెంకటేశ్వరరావు, అబ్బర్వరు వెంకటేశ్వరరావు, పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనురాజు, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు వాసిరెడ్డి మధు, తుమ్మూరి శ్రీనివాసరెడ్డి, యర్రా గంగాధరరావు, దాసరి రాంబాబు, పిన్నమనేని చక్రవర్తి, బొంతు అంజిబాబు, దాదాకరపు సూరింబాబు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఎంతగానో ఉపయోగపడింది



గత ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేసి చూపించారు. నాలుగు విడతలుగా ఆసరా పంపిణీ ద్వారా చేయూతను ఇచ్చారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఆసరా ఎంతగానో ఉపయోగపడింది.

– మక్కిన సుధారాణి, మక్కినవారిగూడెం

సమాజంలో గౌరవం పెరిగింది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్లనే మహిళలకు సమాజంలో గౌరవం పెరిగింది. మహిళలు వారి కాళ్ల మీద వారు నిలబడే శక్తి లభించింది. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలుపునకు కృషి చేస్తాం.

– ఎస్‌కే హఫీజా, మక్కినవారిగూడెం

జీవన ప్రమాణాలు పెరిగాయి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్లే అభివృద్ధి సాధ్యమని నిరూపించబడింది. నవరత్నాల వల్ల కుటుంబాలకు లక్షలాది రూపాయల ఆర్థిక లబ్ధి చేకూరడం ద్వారా జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. మహిళలకు సమాజంలో ప్రత్యేక గుర్తింపు లభించింది. మరోసారి ఆయనే ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నాం.

– మారం రజిని, టి.నరసాపురం

జగనన్న పథకాలతో సత్ఫలితాలు






సభలో మాట్లాడుతున్న ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్, పార్టీ చింతలపూడి కన్వీనర్ కంభం విజయరాజు, సభా వేదికపై సాంస్కృతిక ప్రదర్శన

- ఎంపీ కోటగిరి శ్రీధర్
- జంగారెడ్డిగూడెంలో 'ఆసరా' చెక్కుల పంపిణీ

జంగారెడ్డిగూడెం: జగనన్న నవరత్నాల్లో భాగంగా ప్రతి మహిళ తన కాళ్లపై నిలబడాలని చేపట్టిన పథకాలు సత్ఫలితాలను ఇచ్చాయని తాను పూర్తిగా నమ్ముతున్నానని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. సోమవారం స్థానిక ఎంబీ సోషల్ క్లబ్ ఆవరణలో జరిగిన 'ఆసరా' చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పేదలను ఉన్నత స్థితికి తీసుకురావాలని జగనన్న ఎంతో కృషి చేస్తున్నారన్నారు. గతంలో సంక్షేమ పథకాలు పొందాలంటే రాజకీయ నాయకుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరగాల్సి వచ్చేదని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల అమలుకు సచివాలయ, వలంటీర్ వ్యవస్థను జగనన్న తీసుకువచ్చారన్నారు. పేద ప్రజలు ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం కోల్పోకుండా వారి ఆత్మాభిమానాన్ని కాపాడుకోవాలని ఆలోచించారన్నారు. ప్రతి సామాన్యుడు కూడా జీవితంపై ఆశతో బతుకుతున్నారన్నారు. ఇదంతా జగనన్న వల్ల సాధ్యమైందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజల గుండెల్లో ఉందన్నారు. సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్‌లు, నాడు-నేడు, పింఛన్‌లు, రేషన్ నేరుగా ఇంటికే అందించి జగనన్న మంచితనం, మానవత్వంతో రాష్ట్రాన్ని పాలిస్తున్నారన్నారు. జగనన్నను భుజంపై పెట్టుకునే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకుంటారని తాను నమ్ముతున్నట్లు ఎంపీ శ్రీధర్ విశ్వాసం వ్యక్తం చేశారు.

ప్రజల కష్టాలను తీరుస్తాం : ఎంపీ అభ్యర్థి సునీల్ కుమార్ యాదవ్

సభలో వైఎస్సార్ సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ సీఎంగా మళ్లీ జగనన్నను గెలిపిస్తే ప్రజల కష్టాలను తీర్చి జీవితాలను మరింత మెరుగుపర్చుతామని తెలిపారు. జగనన్న చెప్పింది, చెప్పనిది కూడా చేసి కరోనా కష్టకాలంలో ఇబ్బందులు ఎదురైనా రాష్ట్రాన్ని ఆదుకున్నారన్నారు. తనను ఆశీర్వదించి గెలిపిస్తే అందరికీ అందుబాటులో ఉంటానని, తాను కారుమూరి నాగేశ్వరరావు కొడుకునని, జగనన్న తనను ఆశీర్వదించి మీ మధ్యకు పంపారని చెప్పారు. జగనన్న నాడు-నేడు కార్యక్రమంలో పాఠశాలలను అభివృద్ధి చేశారని, అందు కోసం 70 వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. విద్యతోనే సమాజం బాగుపడుతుందనే ఉద్దేశ్యంతో విద్యాభివృద్ధికి ఎంతో ఖర్చు చేస్తున్నారన్నారు. కార్పొరేట్ స్థాయిలో నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థుల ఉన్నతికి కృషి చేస్తున్నారన్నారు. గతంలో చంద్రబాబు 600 హామీలు ఇచ్చి గాలికి వదిలేశారని ధ్వజమెత్తారు. ప్రజల కోసం పనిచేసే జగనన్న ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలని కోరారు. ప్రజా సమస్యలు తీర్చేందుకు నిరంతరం తాను కష్టపడతానని సునీల్ కుమార్ యాదవ్ హామీ ఇచ్చారు.

ప్రజల చెంతకే పాలన : కంభం విజయరాజు

వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు మాట్లాడుతూ ప్రపంచం గర్వించేలా జగనన్న ప్రజల చెంతకే పాలన తెచ్చారని అన్నారు. తనను ఆశీర్వదించి చింతలపూడి ప్రజల ముందుకు పంపిన జగనన్నకు కృతజ్ఞతలు తెలిపారు. నవరత్నాలు అమలు చేసి సంక్షేమం, అభివృద్ధి చేస్తున్న జగనన్నకు ప్రజలంతా అండగా నిలబడాలని కోరారు. డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసి మహిళా అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధి అని భావించి రాష్ట్రాన్ని ముందుకు నడుపుతున్నారన్నారు. మహిళల కోసం అంబేద్కర్ ఆద్యుడిగా ఉండి, మహిళాభ్యుదయానికి చట్టాలను తెచ్చారని, మహిళల అభివృద్ధి, అక్షరాస్యత ద్వారా దేశాభివృద్ధి సాధ్యమవుతుందని అంబేద్కర్ భావించారన్నారు. అదే బాటలో జగనన్న ముందుకు సాగుతున్నారన్నారు. ప్రపంచం గరివ్వంచేలా విజయవాడలో 205 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. ప్రజల చెంతకే పాలన తెచ్చిన జగనన్నను మళ్లీ సీఎంను చేసుకోవాలన్నారు. తనను ఆశీర్వదించి గెలిపిస్తే రాష్ట్రంలో నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో ఉంచుతానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైస్ చైర్మన్‌లు ముప్పిడి అంజి, కంచర్ల వాసవీరత్నం, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వందనపు సాయిబాల పద్మ, ఉభయగోదావరి జిల్లాల బూత్ కమిటీల కో-ఆర్డినేటర్ బీవీఆర్ చౌదరి, జిల్లా యూత్ అధ్యక్షుడు పడమటి గిరిబాబు గౌడ్, పామర్రు నియోజకవర్గ పరిశీలకుడు మండవల్లి విజయసారథి, పట్టణ, మండల కమిటీ అధ్యక్షులు చిటికెల అచ్చిరాజు, వామిశెట్టి హరిబాబు, మండల సచివాలయాల కన్వీనర్ గురజాల పార్థసారథి, పట్టణ యూత్ అధ్యక్షుడు కాసర బన్నీ, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి కఠారి సీతారాంబాబు, కౌన్సిలర్‌లు, బత్తిన చిన్న మేడవరపు విద్యాసాగర్, సాయిజ్యోతిక, పాములపర్తి శ్రీనివాస్, గూడపాటి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఎంపీ శ్రీధర్, వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి విజయరాజు



జంగారెడ్డిగూడెంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

జంగారెడ్డిగూడెం: మున్సిపల్ పరిధిలో పలు అభివృద్ధి పనులను సోమవారం ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తోందన్నారు. మౌలిక వసతుల కల్పనకు నిధులను మంజూరు చేస్తూ అభివృద్ధికి చిరునామాగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిలుస్తోందని పేర్కొన్నారు. జంగారెడ్డిగూడెం పురపాలక సంఘ పరిధిలోని పేరంపేట రోడ్డు నందు రూ.5 లక్షలతో నిర్మించిన కమ్యూనిటి హాల్, 15వ వార్డు ఊరచెరువు వద్ద రూ.35 లక్షలతో నిర్మించిన సీసీ డ్రెయిన్, 19వ వార్డు ఉప్పలమెట్టలో రూ.23.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును వారు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు ముప్పిడి అంజి, కంచర్ల వాసవీరత్నం, పార్టీ పట్టణాధ్యక్షుడు చిటికెల అచ్యుత రామయ్య, కౌన్సిలర్‌లు, కో-ఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి సీఎం జగన్

జంగారెడ్డిగూడెం రూరల్: ప్రజల వద్దకే సంక్షేమ పాలనను తీసుకొచ్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. జంగారెడ్డిగూడెం మండలంలో అభివృద్ధి పనులను వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజుతో కలిసి ఆయన ప్రారంభించారు. కృష్ణంపాలెంలో కమ్యూనిటీ హాల్, శోభనాద్రిపురంలో కల్వర్టు, కేతవరం నుంచి కృష్ణంపాలెం రోడ్డులో కల్వర్టు, తిరుమలాపురంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, మైసన్నగూడెంలో రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్, సచివాలయం భవనం, దేవులపల్లిలో రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, వైఎస్సార్ సీపీ పామర్రు నియోజకవర్గ పరిశీలకుడు మండవల్లి సోంబాబు, పార్టీ మండలాధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పడమటి గిరిబాబు, సీనియర్ నాయకులు బీవీఆర్ చౌదరి, రాఘవరాజు ఆదివిష్ణు, మేడవరపు విద్యాసాగర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పొజిషన్ సర్టిఫికెట్ల కోసం వినతి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న మాధవరం గ్రామస్తులు

కుక్కునూరు: ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఉండేందుకు తమకు పొజిషన్ సర్టిఫికెట్‌లు ఇవ్వాలని కోరుతూ సోమవారం మండలంలోని మాధవరం గ్రామస్తులు కుక్కునూరు తహసీల్దార్ అచ్యుతా కుమారిని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ప్రతి ఏడాది గోదావరి వరదకు పంచాయతీలో ముందు మునిగే మాధవరం గ్రామాన్ని పోలవరం ప్రాజెక్ట్ 45 కాంటూర్ పరిధిలో పేర్కొన్నారని తహసీల్దార్‌కు తెలిపారు. గోదావరి వరదల సమయంలో గ్రామంలో ఇళ్లు ముంపునకు గురవ్వడంతో ఖాళీచేసి ఆర్ అండ్ ఆర్ కాలనీలకు వెళ్లడం వరద తగ్గిన తరువాత మరలా ఇళ్లకు చేరడం జరుగుతుందన్నారు. వరద కారణంగా ఇళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయని, ఇకపై ఆ ఇళ్లలో ఉండలేమని వారు తహసీల్దార్ వద్ద వాపోయారు. మద్రిపాడు ఆర్ అండ్ ఆర్ కాలనీల్లోకి 45 కాంటూర్ వారికి కూడా ఇంటి నిర్మాణాలు పూర్తయ్యాయని వాటిలో ఉండేందుకు సైట్ ఇంజినీర్ పొజిషన్ సర్టిఫికెట్‌లు తెచ్చుకుంటే ఇల్లులు అప్పగిస్తామంటున్నారని, కావున తమకు పొజిషన్ సర్టిఫికేట్‌లు ఇచ్చి విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని తహసీల్దార్‌ను కోరారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఎంపీటీసీ సూర్యనారాయణ, సర్పంచ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులు

లింగపాలెం: సింగగూడెం గ్రామానికి చెందిన పోతుల శ్రీనివాసరావు నాయుడు (49) గుండెనొప్పితో ఆదివారం రాత్రి మరణించారు. ఆయన కళ్లను విజయవాడకు చెందిన అగర్వాల్ ఐ ఆస్పత్రికి దానం ఇచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నాయీ బ్రాహ్మణ కమిటీ హాల్ ప్రారంభం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో నాయీ బ్రాహ్మణ కమిటీ హాల్‌ను సోమవారం ప్రారంభించారు. నాయీ బ్రాహ్మణ సేవా సంఘం పట్టణాధ్యక్షుడు మల్లవరపు నాగపోసి, చిప్పాడ నరసింహారావు ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమానికి ఎంపీ కోటగిరి శ్రీధర్, వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, పార్టీ పామర్రు నియోజవర్గ పరిశీలకుడు మండవల్లి విజయ సారథి, సీనియర్ నాయకుడు మేడవరపు విద్యాసాగర్, ఉభయ గోదావరి జిల్లాల బూత్ కమిటీల రీజినల్ కోఆర్డినేటర్ బీవీఆర్ చౌదరి, వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీకి వినతి పత్రం

విశ్వకర్మ యోజన పథకంలో దర్జీ సోదరులకు ఏలూరులో శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బుస బాల భాస్కర్‌రెడ్డి, సెక్రటరీ సాధనాల సర్వేశ్వరరావు ఎంపీ కోటగిరి శ్రీధర్‌కు వినతి పత్రం సమర్పించారు.

14న సామూహిక అక్షరాభ్యాసాలు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని గుర్వాయిగూడెం శ్రీ అయ్యప్ప స్వామివారి క్షేత్రం ఉపాలయంలో ఉన్న శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి దేవస్థానంలో ఈనెల 14వ తేదీ ఉదయం సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ కీసరి రామిరెడ్డి తెలిపారు. అక్షరాభ్యాస కార్యక్రమంలో తమ చిన్నారులతో తల్లిదండ్రులు పాల్గొనాలని కోరారు.

సారా బట్టీలపై దాడులు

పోలవరం రూరల్: పోలవరం మండలం ఎల్ఎన్‌డీ పేట అటవీ ప్రాంతంలో సారా బట్టీలపై పోలీసులు దాడులు నిర్వహించారు. దాడుల్లో 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సారా తయారు చేసినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎస్ఎస్ పవన్ కుమార్ హెచ్చరించారు. 25 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీ చేసే వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు.

కరాటేలో పతకాలు

చింతలపూడి: ఈనెల 11వ తేదీన విజయవాడలో జరిగిన ఫస్ట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ కరాటే పోటీల్లో చింతలపూడి శ్రీ చైతన్య స్కూల్‌కు చెందిన విద్యార్థులు పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ సురేష్ తెలిపారు. విద్యార్థులు నితీష్, అయాన్‌లు స్వర్ణ పతకాలు, జెశ్వంత్, అష్రఫ్, కృతిక్, అక్షిత్ పాల్ వెండి పతకాలు, అంశు, జమాల్, శ్రీరామ్, మహిధర్, కార్తికేయ, అక్షయ, ప్రాణీత్, లిఖిత్ వర్ధన్, ఫణీంద్ర, మణికంఠ రజత పతకాలు సాధించినట్లు చెప్పారు. విద్యార్థులు, కోచ్ సుమన్ రాజును అభినందించారు.

15న సంత్ సేవాలాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠ

బుట్టాయగూడెం: బంజారాల జీవితాల్లో వెలుగు నింపిన మహనీయుడు సంత్ సేవాలాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠ ఈనెల 15వ తేదీన నిర్వహిస్తున్నట్లు బంజారా సుగాలి(లంబాడీ) సంక్షేమ సంఘం నాయకుడు బానోతు కృష్ణ నాయక్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహరాజ్ 180వ జయంతి ఉత్సవాల సందర్భంగా బుట్టాయగూడెం మండలం కోయరాజమండ్రిలో విగ్రహం ఏర్పాటుతో పాటు నూతన భవనం కూడా ప్రారంభించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఉన్న గోర్ బంజారా సోదర సోదరీమణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సంపూర్ణ పారిశుధ్యం సాధించాలి

చింతలపూడి: సంపూర్ణ పారిశుధ్య రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడానికి ప్రజలు సహకరించాలని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం గ్రామ పంచాయతీలకు డస్ట్‌బిన్‌లు అందజేశారు. ప్రతి ఒక్కరూ పారిశుధ్య ఉద్యమంలో భాగస్తులు కావాలని ఎంపీపీ రాంబాబు నాయక్ కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చిన్న రాట్నాలు, ఈఓపీఆర్డీ రాణి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఆటల పోటీలు

ఏలూరు రూరల్: స్థానిక చొదిమెళ్ల మండల పరిషత్ పాఠశాలలో సోమవారం బాలమేళ నిర్వహించారు. చైల్డ్‌రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ ఎస్ రవికుమార్ ఆధ్వర్యంలో పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బత్తిన విజయకుమార్ మాట్లాడుతూ బాలబాలికలు ఆరోగ్యం, మానసికంగా దృఢంగా ఉండాలన్నారు. ఇందుకు అనుకూలమైన వాతావరణం సృష్టించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. మంచి ఆలోచనలతో పిల్లలు ఎదగాలన్నారు. ఆటలు, చదువు పట్ల పిల్లలకు ఉన్న శ్రద్ధను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. అనంతరం జబ్‌జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.